

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 17 | సంచిక : 04 | డిసెంబర్ 2011

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు ~ 534 265
☎ 08814 - 224747
📱 9247104551


ఈ సంచికలో....


జిన్నూరు ......... 19-06-2011
హైదరాబాదు ... 23-09-2011
అమలాపురం .. 23-10-2011



ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 📱 9848716747


**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-06-2011, జిన్నూరు)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

దేహాన్ని కేంద్రంగా, మనస్సుని కేంద్రంగా పెట్టుకొని వచ్చే ఏ కోరిక లేకుండా, నాకు అది కావాలి, ఇది కావాలి అనే కోరిక లేకుండా ఉండటమే పరిపూర్ణమైన శరణాగతి కదా అని ఒకరు భగవాన్‌ని అడిగారు. నీకు వ్యక్తిగతమైన కోరికలు అంటూ ఏమీ ఉండకూడదు. భగవంతుడు నీకు ఏది అనుగ్రహిస్తే దానితో సంతుష్టుడవై ఉండాలి. అది పరిపూర్ణమైన శరణాగతి. నీ దేహప్రారబ్దాన్ని బట్టి నీ కోటాకి ఇచ్చేది ఇస్తూ ఉంటాడు. దానితోటి నువ్వు సంతృప్తి పడకుండా నువ్వు దురాశ కలిగిఉంటే అది శరణాగతి అవ్వదు అని భగవాన్ చెప్పారు. ఒక దేహంతోటి, ఒక పేరుతోటి తాదాత్మ్యం లేకుండా ఉండటమే జ్ఞానం. రూపంతోటి, నామంతోటి తాదాత్మ్యం వలనే కీర్తికాంక్ష వస్తుంది, వ్యక్తిగతమైన కోరికలు వస్తాయి. ఫలానా దేహాన్ని నేను, ఫలానా పేరు నాది అనేటువంటి తాదాత్మ్యాన్ని వదిలించుకోవటమే మనం చెయ్యవలసిన ముఖ్యమైన సాధన.

గాంధీగారు భారతదేశానికి స్వాతంత్ర్యం కోసం కృషి చేస్తున్నారు. మరి అది కూడా కోరికే కదా అని భగవాన్‌ని అడిగారు. అది కూడా కోరికే అయితే ఆ కోరిక ఆయన దేహానికీ, మనస్సుకీ సంబంధించినది కాదు. అది సమిష్టిగా ఆయన ఆలోచించి చేస్తున్నారు కాబట్టి ఆ కోరిక ఆయన హృదయాన్ని విశాలం చేస్తుంది, బుద్ధిని విశాలం చేస్తుంది. అది ఆత్మజ్ఞానానికి ప్రిపేర్ చేస్తుంది. గాంధీగారు హృదయపూర్వకంగా కృషిచేసినమాట నిజమే కాని భగవంతుడి సంకల్పం ఎలా ఉంటే అలా జరుగుతుంది. జరిగేది భగవంతుడి సంకల్పం అనుకునేది మన

సంకల్పం. జ్ఞానం పొందటానికి నేను తీసుకోవలసిన చర్యలు ఏమిటి అని భగవాన్‌ను అడిగితే భగవాన్ రెండు మార్గాలు చెప్పారు. ఇప్పుడు నువ్వు నేను, నేను అంటున్నావు. ఆ నేను యొక్క మూలాన్ని కనుగొనటం ఒక పద్ధతి. ఈ నేను వల్ల ఏమీ అవ్వదు. నేను అసక్తుడిని, ఈశ్వరుడికి అన్ని శక్తులూ ఉన్నాయి, ఆయనపై భారం వేయటం తప్ప నాకు మరో మార్గం లేదు అనుకోవటం శరణాగతిమార్గం. జ్ఞానమార్గంలో వెళ్ళినా, శరణాగతిమార్గంలో వెళ్ళినా ఈ నేనులోంచి బయటపడాలి. భగవాన్ చెప్పిన సీక్రెట్ ఇది. అంతేగాని బండతనంగా జపం, ధ్యానం చేసినంత మాత్రం చేత జ్ఞానంరాదు.

భగవాన్ చెప్పిన ప్రోసెస్ జప, ధ్యానముల కంటే ఎక్కువ ఉపయోగపడుతుంది. మీరు జాగ్రత్తగా అర్థం చేసుకోండి. ఈ జన్మలో అయినా, రాబోయే జన్మలో అయినా ఈ నేను అనే సమస్యను పరిష్కారం చేసుకోవాలి. మీరు ధ్యానం బాగా చేస్తున్నారు. నిజమైన నేనుకి ధ్యానం అక్కరలేదు. ఈ దొంగనేనే ధ్యానం చేస్తుంది. జపం ఎవరు చేస్తారు, ఈ దొంగ నేనే జపం చేస్తుంది. మీరు జపం చేస్తున్నారు, ధ్యానం చేస్తున్నారు కానీ వీడు మిగిలిపోతున్నాడు కదా! ఈ నేనులో నుండి నువ్వు విడుదల పొందకపోతే ఎన్ని చేసినా ఏమీ ప్రయోజనం లేదు. ఈ అబద్ధమైన నేను మీదే లోకము, పునర్జన్మలు, పూర్వజన్మలు, దేవతలు అందరూ ఆధారపడి ఉన్నారు. అందుచేత నీకు సంతోషం వస్తోంది అని నువ్వు సంతోషించకు. ఈ సంతోషం ఏ నేనుకు వస్తోంది? మీకు అశాంతి వస్తోంది అనుకోండి, ఈ అశాంతి ఏ నేనుకి వస్తోంది? మీకు గర్వం వస్తే ఈ గర్వం ఏ నేనుకి వస్తోంది? ఇవి సత్యమైననేనుకి రావటంలేదు. అవన్నీ అసత్యం కాబట్టే అసత్యమైననేనుకి ఇవన్నీ వస్తున్నాయి అని మీరు మాట మాటకి ఆ నేనుని ప్రశ్నించుకోవటం వలన అది నెమ్మదిగా లోపలికి జరగటం ప్రారంభిస్తుంది. ఈ పద్ధతిని మీరు గుడ్డితనంగా చేయటంకాదు. ఒక ఎడ్యుకేషనల్ ప్రోసెస్ ఇది. ఇది మీకు అర్థం అయితే జపంకంటే, ధ్యానంకంటే ఇది తేలిక. నేను, నేను అని చెప్పే ఈ నేను ఎవరు? ఇతరుల్ని నువ్వెవరు? నువ్వెవరు? అని ప్రశ్నించటంకంటే ఈ నేనును మనం ప్రశ్నించుకొంటూ ఉంటే లోచూపు కలుగుతుంది, అంతర్ముఖం కలిగి అది ఎక్కడ నుంచి ఉదయించి వస్తోందో అక్కడకి జరగటం ప్రారంభిస్తుంది. అది జప, ధ్యానములకంటే మంచిది. శారీరకంగా మీరు పెద్ద శ్రమపడనక్కరలేదు. అయితే ఈ ప్రోసెస్ చేసేటప్పుడు మీరు ఆహారవిషయంలో జాగ్రత్తగా ఉండాలి, అతి నిద్ర ఉండకూడదు, అవి యోగానికి భంగం. అందుచేత మీరు ఈరకంగా ప్రయత్నం చేస్తే అసత్యమైన నేనులోంచి విడుదల పొందుతారు.

మీరు ధ్యానం చెయ్యవచ్చు, జపం చెయ్యవచ్చు కాని అవి స్ప్రింగు మంచం లాంటివి. మనం స్ప్రింగు మంచం మీద కూర్చున్నప్పుడు అది కిందికి వెళుతుంది. మనం ఆ మంచం మీద నుంచి లేవగానే ఆ స్ప్రింగు మంచం మామూలు స్థితికి వచ్చేస్తుంది. ఈ మనస్సు కూడా అంతే. మీరు జపం చేసినప్పుడు ఆ పది నిమిషాలు బావుంటుంది, ధ్యానం చేసినప్పుడు మీకు శాంతిగా ఉంది అని ఆ పదినిమిషాలు అనిపిస్తుంది. తరువాత ఈ నేను మళ్ళీ మామూలుగా విజృంభించేస్తుంది. భగవాన్ ఏమని చెప్పారు అంటే మీరు ధ్యానం చేసినా ఈ నేను కొంత అణుగుతుంది, జపం చేసినా ఈ నేను కొంత అణుగుతుంది. ఆ రెండూ చేయలేకపోతే మహాత్ముల సన్నిధానంలో కూర్చున్నా ఈ నేను దానంతట అదే అణిగిపోతుంది. మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహగతమైన నేనులో నుండి విడుదల పొందాలి. హృదయంలో సద్వస్తువు లేకపోతే అది వశిష్టుడికీ అనుభవంలోనికి రాదు, విశ్వామిత్రుడికీ అనుభవంలోనికి రాదు కదా! అది లోపల ఉంది కాబట్టి వాళ్ళకి అనుభవంలోనికి వచ్చింది. అలాగ మనం కూడా పొందవచ్చును అనేటువంటి ఆత్మవిశ్వాసం మనకి ఉండాలి. ఈ మార్గంలో పిరికితనం ఉండకూడదు, అనుకరణ ఉండకూడదు. మన మనస్సు అంతర్ముఖం అవ్వటానికి ఏ కారణాలు అయితే అడ్డువస్తున్నాయో ఆ కారణాల్ని తొలగించుకుంటూ ఉంటే మనస్సు వెళ్ళి దాని మూలంలో పడిపోతుంది.

భగవంతుడిపైన పూర్తిగా భారం వేసి జీవించటం శరణాగతి. అందుచేత నువ్వు పూర్తిగా భగవంతుడిమీద భారం వెయ్యి. శరణాగతి ఎలాఉండాలి అంటే, ఈ పుస్తకం నాచేతిలో ఉంది, నేను ఈ పుస్తకాన్ని కింద పెట్టేస్తాను. నన్ను కింద ఎందుకుపెట్టారు అని ఈ పుస్తకం అడగదు, చేతిలో పెట్టుకుంటే ఎందుకు చేతిలో పెట్టుకున్నారు అని అడగదు. ఈ పుస్తకాన్ని పుష్పాలు పెట్టి పూజిస్తే నన్ను ఎందుకు పూజిస్తున్నారు అని అడుగదు. ఎలాగ చేసినా ఆ పుస్తకం ఎంత క్వయిట్‌గా, ఎంత కామ్‌గా ఉంటుందో అలా మీ మనస్సు కూడా ఉండగలగాలి. ఆయన సంకల్పమే మన సంకల్పం, ఆయన ఇష్టమే మన ఇష్టం అని ఎవడైతే జీవిస్తున్నాడో వాడు శరణాగతి చేసినట్టు. బాగా డబ్బు ఉన్న వాళ్ళని మీరు డబ్బు బాగా సంపాదించారు అనండి. మీరు ఆ మాట అనకముందు ఎలా ఉన్నారో ఆ మాట అన్నాక వారు అలాగ ఉండరు. వాడికి ఎంతోకొంత సంతోషం వస్తుంది. ఎందుచేతనంటే ఆ మాట యొక్క ప్రభావం వాడి అహంకారం మీద పడి వాడికి సంతోషం వస్తోంది. ఆ సంతోషకారణం వాడి మనస్సుని అంతర్ముఖం అవ్వనివ్వదు. ఆ మాట అనకముందు నువ్వు ఎలా ఉన్నావో, ఆ

మాట అన్నాక కూడా నువ్వు అలాగ ఉండగలిగితే నువ్వు యోగివి అవుతావు. చాలామందికి వాళ్ళని వాళ్ళు పొగుడుకోవటం చాలా ఇష్టం. ఇది చాలా ప్రమాదం. మిమ్మల్ని ఎవరైనా పొగుడుతున్నారు అనుకోండి వాళ్ళని పొగడవద్దు అంటే మానరుకదా! మీరు వెంటనే ఆ సబ్జక్టు మార్చేసి ఇంకో సబ్జక్టు మాట్లాడాలి. ఆ పొగడ్తలు మీరు వినటంవలన దేహగతమైన నేను పెరిగిపోతూ ఉంటుంది. మీరు ఇతరులను విమర్శించటం వలన కూడా ఆ నేను పెరిగిపోతూ ఉంటుంది. అందుచేత దైనందినజీవితంలో మన ప్రవర్తన ఎలా ఉందో పరిశీలన చేసుకుంటూ ఉండాలి. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. అన్ని శక్తులూ భగవంతుడికి ఉన్నాయి. నాకు ఏ శక్తులూ లేవు. ఈ అహంకారం ఎందుకు పనికి రానిది. ఒకవేళ నాకు ఏదైనా శక్తి ఉంటే అది భగవంతుడు ప్రసాదించినదే. ఆయనే సర్వస్వం అనే నమ్మకం నీకు స్థిరపడాలి. అలా స్థిరపడితే అది శరణాగతి. శరణాగతిలో కూడా దేహగతమైన నేను పోతుంది. భక్తి కూడా అద్వైతానుభవానికే తీసుకువెళుతుంది. ద్వైతం వలన భయం వస్తుంది, దుఃఖం వస్తుంది, వేదన వస్తుంది. ద్వైతం వలన విరోధాలు వస్తాయి. మీకు ఏ విషయంలో అయినా భయం వేస్తోంది అనుకోండి, మీలో ద్వైతబుద్ధి ఉన్నట్టే. ఏది జరిగినా భగవంతుడి సంకల్పం ప్రకారమే జరుగుతోంది అని నీకు నూటికి నూరుపాళ్ళు విశ్వాసం కలిగితే అప్పుడు నీకు శరణాగతి పూర్తి అయినట్టు.

చెడ్డస్నేహాలు మొట్టమొదటిలో తియ్యగా ఉంటాయి. ఆ స్నేహం పరిణామంలో విషం అయిపోతుంది. మీ చావుకి కూడా అది దారితీయవచ్చు. మంచి స్నేహాలు అలాక్కాదు. మొదటిలో ఆ స్నేహాలు పెద్ద తియ్యగా ఉండవు. మంచి స్నేహితులు ఎలా ఉంటారు అంటే మీకు ఏదైనా మంచి చేస్తే చేస్తారు కాని వాళ్ళు అల్లరిచిల్లరిగా ఉండరు. మంచి స్నేహితులు మీకు మొదట నచ్చకపోయినా వారు పరిణామంలో మిమ్మల్ని మోక్షం వరకూ తీసుకువెడతారు. మనం మంచిగా లేకపోవచ్చు, ఎదుటివారి మంచితనం గురించి చెబుతూ ఉంటే అది భరించలేకపోతే ఎలాగ? ఇంక మనకి జ్ఞానం ఏమిటి? చాలామంది మనుషులు పాడైపోవటానికి కారణం ఏమిటి అంటే స్వార్థం. స్వార్థం ఉన్నవాడు దేహభావనలోంచి విడుదల పొందలేడు. స్వార్థమే పాపం, స్వార్థానికి మించిన పాపం లేదు. ప్రపంచంలో స్వార్థం తప్పించి ఇంకో పాపం ఉందని నేను అనుకోవటం లేదు అని వివేకానంద అన్నాడు. నమ్మాళ్వార్ ఏమన్నాడు అంటే ఓ పెరుమాళ్ళూ ఇంతవరకూ నీవు వేరు, నేను వేరు అని నేను నిన్ను ప్రార్థిస్తూ వచ్చాను. నిన్ను తెలుసుకోవటానికి ప్రయత్నం చేసి తెలుసుకున్నాను.

నిన్ను తెలుసుకున్నాక నువ్వే ఉన్నావు, నేను లేనని నాకు తెలిసింది. అది అద్వైతమే. శరణాగతి చివరికి అద్వైతంలోనికి తీసుకువెళ్ళింది. అది కూడా ఆత్మ జ్ఞానంతోటి సమానం. శరణాగతి గురించి మీరు విన్నప్పుడు తేలిక అనిపిస్తుంది. కాని మీరు అనుకున్నంత తేలిక కాదు. శరణాగతి చేసినవాడికి ఇష్టం, అయిష్టం ఉండకూడదు. ఇష్టాలు, అయిష్టాలు ఉన్నవాడు శరణాగతి చేయలేడు. శరణాగతి చేసినవాడికి నెమ్మదిగా రాగద్వేషాలు పోతాయి. స్వార్థం లేకుండా పని చేయాలి. అది మీరు అనుకున్నంత తేలిక కాదు. నువ్వు చేసేపని ఎలా ఉండాలి అంటే నేనులోంచి విడుదలపొందటానికి అది సహకరించాలి. అదీ కర్మయోగం. నువ్వు కర్మని యోగంగా చేస్తే, కర్మని నేర్పుగా చేస్తే అప్పుడు కూడా ఈ నేనులోంచి నువ్వు విడుదల పొందుతావు.

కొంతమంది కర్మ చేసి వాళ్ళకి ఉపకారం చేసాము, వీళ్ళకి ఉపకారం చేసాము అని అనుకుంటారు. అంటే వాళ్ళకంటే నువ్వు భిన్నం అనుకుంటున్నావు. అక్కడ ద్వైతబుద్ధి వచ్చింది. ఆ దేహాన్ని కూడా నీ దేహంగా చూచుకోలేకపోతున్నావు అది కర్మయోగం కాదు. మిమ్మల్ని మీరు ఎలా ప్రేమించుకుంటున్నారో అలాగ ఇతరుల్ని ప్రేమించగలిగినవాడే కర్మయోగి అవుతాడు కాని మిగతావాళ్ళు కర్మయోగులు అవ్వరు. నువ్వు అన్నం తింటున్నావు, ఎవరికో ఉపకారం చేసాను అనుకుంటున్నావా? అనుకోవటం లేదు. ఇంకొకళ్ళకి అన్నం పెడితే వాళ్ళకి ఉపకారం చేసాను అనుకుంటున్నావు. మనిషి యొక్క స్వార్థబుద్ధి, దుష్టబుద్ధి ఇక్కడే ఉంది. ఆ దేహం వేరు, నా దేహం వేరు అనే బేధబుద్ధి ఉంది కదా. ఆ బేధబుద్ధి నశించకపోతే అది కర్మయోగం కాదు. చొక్కాకో జేబు ఉంది, లాగుకో జేబు ఉంది. లాగు జేబులో ఉన్న పది రూపాయలు తీసుకొని చొక్కా జేబులో పెడతాను అనుకో, అది ఎవరికి అయినా ఇచ్చాను అని నువ్వు అనుకొంటున్నావా? లేదు. ఎందుచేత! ఈ జేబు నీదే, ఆ జేబు నీదే. ఆ రకంగా నువ్వు కర్మ చేస్తే ఈ మిథ్యానేనులోంచి నువ్వు బయటకి వచ్చేస్తావు. కర్మయోగంలో గొప్పతనం ఏమిటి అంటే నువ్వు చేసే కర్మలో నీ మైనస్‌పాయింట్స్, ప్లస్‌పాయింట్స్ తెలుస్తుంది. పని చెయ్యటం మొదలు పెట్టాక నీకు ఆత్మజ్ఞానం లేదని తెలుస్తుంది కాని అది పుస్తకాలు చదవటం వలన రాదు. కర్మయోగం వలన కూడా అనేకమంది ఆత్మజ్ఞానం పొందినవాళ్ళు ఉన్నారు. కర్మయోగి ఈ సృష్టి అంతా ఈశ్వరుని శరీరం అనే భావనతో పనిచేస్తాడు. అలా పని చేసినప్పుడు వాడికి ఈ నేను పోతుంది. మదర్‌థెరిస్సా వాళ్ళు అలా పని చేసారు. వాళ్ళు వర్కు చేసారు కానీ నెత్తిమీద ఏమీ మోయలేదు. ఇప్పుడు ఇంట్లో వాళ్ళు ఇంట్లో వాళ్ళే

గుర్తింపు కోరుకుంటున్నారు. ఇంక వాళ్ళకి సేవ ఏమిటి? భగవంతుడు నువ్వు చేసే వర్కు చూస్తూ ఉంటాడు. నువ్వు ఆ పని ఏ ఉద్దేశ్యంతోటి చేస్తున్నావు? స్వార్థంతోటి చేస్తున్నావా? లేకపోతే ఈశ్వరుని అర్చనగా చేస్తున్నావా? అని లోపల ఉన్న అంతర్యామి పరిశీలిస్తాడు. కొంతమంది పని ద్వారానే తరిస్తారు. అన్ని మార్గాలూ మంచివే. కర్మమార్గంలో అయినా, భక్తి మార్గంలో అయినా, జ్ఞానమార్గంలో అయినా మనస్సుని తన మూలంలోకి తీసుకువెళ్ళి అక్కడ అణిచివేయాలి. మనస్సు దాని మూలంలో స్థిరంగా ఉండటం వలన అది కరిగిపోతుంది, అప్పుడు నీకు నోమైండు స్టేటు వస్తుంది. దానిని మృతమనస్సు అంటారు. అప్పుడు అది నిన్ను బంధించదు. అది కాలిపోయిన తాడులాంటిది.

శరణాగతి పూర్తి అయిన తరువాత మనస్సు ఎలా ఉంటుంది అని ఒకరు భగవాన్‌ని అడిగారు. అమనస్కస్థితి గురించి నేను చెప్పినా నీకు తెలియదు. అది అనుభవంలోనికి వచ్చాక నీకు తెలుస్తుంది. అది నోటితోటి చెప్పేదికాదు, మనస్సుతోటి ఆలోచించేది కాదు. నువ్వు శరణాగతి చేస్తే నీకు వచ్చే లాభం ఏమిటి అంటే? నీకు వ్యక్తిగతమైన కోరికలు తగ్గిపోతాయి. జ్ఞానికి శరీరం అవసరం లేదు. ఏ కోరికా లేనివాడు శరీరం ఏమి చేసుకుంటాడు. కూలికోసం మోసేవాడు ఆ పెట్టెని ఎప్పుడు కింద పెట్టేద్దామా అని కనిపెట్టుకొని చూస్తూ ఉంటాడు కాని నెత్తిమీద ఇంకో గంటసేపు ఈ పెట్టె ఉంటే బావుండును అని అనుకోడు. అలాగే జ్ఞాని కూడా దేహాన్ని విడిచిపెట్టటానికి అలా కనిపెట్టుకొని ఉంటాడు. జ్ఞాని సుఖపడటానికి కాని, సంతోషించటానికి కాని శరీరంతోటి పనిలేదు. శరీరంతోటి పనిలేనప్పుడు జ్ఞానికి శరీరం ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే. మనం నేను, నాది అని అనుకుంటాము. అవి నిజంగా లేవు. కానీ అవి ఉన్నాయి అని నువ్వు అనుకుంటున్నావు. అవి రెండూ తలంపులే. ఈశ్వరుడు తప్పించి ఈలోకంలో ఏమీ లేదని ఆ గ్రహింపు నీకు రావాలి. దాని తాలుక అనుభవం వస్తే నీకు దుఃఖం వెదికినా దొరకదు. అదే జ్ఞానం, అదే భక్తి, అదే యోగం. నేను, నాది అనేది ఉందని ఎంత గట్టిగా అనుకుంటున్నామో అలాగే ఈశ్వరుడు ఉన్నాడని అంతగట్టిగా మనం అనుకోవటం లేదు, ఈశ్వరుడు తప్పించి ఏమీ లేదు అని నువ్వు నోటితోటి అంటే చాలదు. అది నీ అనుభవంలోనికి రావాలి. ఉన్నదేదో మనకి అర్థం అయ్యేవరకూ లేనిది ఉందని అనుకుంటూనే ఉంటాము. ఆత్మ తప్పించి వేరే ఏమీ లేదని ఆ గ్రహింపు మనకు రావాలి.

భక్తి అంటే కోరికలతోటి సంబంధం లేకుండా, కారణాలతోటి సంబంధం లేకుండా

అకారణంగా మీకు ఈశ్వరుడి పాదాల మీద ప్రేమకలిగితే అది భక్తి. ఆ భక్తికి కారణం కనిపిస్తే అది వ్యాపారంలోకి వస్తుంది. భగవంతుడు సంకల్పం ప్రకారం నువ్వు ఉండాలి కాని నీ సంకల్పాన్ని నెరవేర్చమని నువ్వు అడగకూడదు. నీ మనస్సులో ఏ కోరికలు అయితే ఉన్నాయో దానికి అనుగుణంగా ఆయనని ప్రవర్తించమంటే అది భక్తా లేకపోతే భగవంతుడి మీద పెత్తనం చెయ్యటమా? దేవుడి మీద భక్తి ఉన్నవాడు ఆయన మీద పెత్తనం చెయ్యాలని చూడడు. నాకు ఇది కావాలి, అది కావాలి అని అసలు అడగడు. నీ సంకల్పం నెరవేర్చాడు అనుకో, ఆ సంకల్పం వలన వచ్చే పరిణామాలు నీకు తెలియవు కదా! దానివలన నువ్వు ప్రమాదాలలో పడవచ్చు. అందుచేత భగవంతుడిని ఏమీ కోరుకోకు. నీకు ఏది మంచిదో నీకంటే ఈశ్వరుడికే బాగా తెలుసు. నువ్వేమీ అడగకుండా అంతా ఆయనకే విడిచిపెట్టేస్తే మొత్తం నీ భారం అంతా ఆయనే మోస్తాడు. నీకు ఏదైనా బెంగ పెట్టుకునే కారణం ఉన్నా నువ్వు బెంగపెట్టుకోకపోతే నీ బెంగ ఆయనే తీసుకుంటాడు. అప్పుడు నీ బెంగ పలచబడిపోతుంది. నీకు చింతకి కారణం ఉన్నా నువ్వు చింతలేకుండా ఉంటే నీ చింత ఆయన పుచ్చుకుంటాడు. గతి అల్లా శరణాగతే, శరణాగతి వల్ల కూడా మనోనాశనం అవుతుంది. మనం నేను నేను అంటాం కదా! ఆ నేను అంటే నీకు బాగా ఇష్టమే కదా! ఆ నేనుని ఈశ్వరుడి పాదాల దగ్గర సమర్పించటమే భక్తి. నీకు భోగప్రవృత్తి ఉన్నప్పుడు శరీరం మీద నీకు ఇష్టం వస్తుంది కాని లేకపోతే నీ శరీరం మీద కూడా నీకు ఇష్టం రాదు. నీకు ఇష్టం రావచ్చు, అయిష్టం రావచ్చు. ఇవన్నీ తలంపులే. నీకు అనేక తలంపులు వస్తూ ఉంటాయి, వెళ్ళిపోతూ ఉంటాయి. అందులో ఏ తలంపును పట్టుకొన్నా నీ మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. నువ్వు ఇష్టమైన తలంపుని పట్టుకోవద్దు, అయిష్టమైన తలంపుని పట్టుకోవద్దు. చివరికి రెండూ నిన్ను విడిచిపెట్టి వెళ్ళిపోతాయి. అప్పుడు మీ మనస్సు అంతర్ముఖం అవుతుంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-09-2011, హైదరాబాదు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

పరమాత్మ యొక్క ఔన్నత్యం మనకు తెలిస్తే భగవద్గీత యొక్క ఔన్నత్యం కూడా మనకి తెలుస్తుంది. పరమాత్మ యొక్క ఔన్నత్యం మనకి తెలియనప్పుడు, పరమాత్మ చేత టీచ్ చేయబడిన గీత యొక్క ఔన్నత్యం మనకి తెలియదు. భగవద్గీత ఎక్కడో చెట్లుకింద కూర్చుని